సంక్షేమ పాలనతో కొత్త వెలుగులు

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, గంగడపాలెం ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ బ్రోచర్‌లను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పాలన కొనసాగుతోందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

టీడీపీ సృష్టించిన ఆటంకాల వల్లే...

జీవీఎంసీ 4వ వార్డులో మంగమారిపేట, కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెం ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్లు రాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో గతంలో 314 సర్వే నంబరు గల ప్రభుత్వ భూమిపై టీడీపీ నాయకులు కోర్టులో కేసు వేశారని, వారు సృష్టించిన ఆటంకాల వల్లే నేడు ఈ ప్రాంత ప్రజలకు ఇళ్లు రాకుండా అయ్యిందని ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, పార్టీ కన్వీనర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా నిత్యానంద త్రయోదశి వేడుకలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నిత్యానంద త్రయోదశిని పురస్కరించుకుని అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, నితాయి సేవిని మాతాజీ ఆధ్వర్యంలో పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నితాయి గౌరంగ ప్రభువులకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక హారతి, భక్తి గీతాలతోపాటు శయన హారతి, పల్లకి ఉత్సవాలు, మహా సంకీర్తన నిర్వహించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎమ్మెల్సీ విజయానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పూడి తిరుపతిరావు

భీమునిపట్నం: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మాధవ్ విజయానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ ప్రవాస యోజన ఇన్‌చార్జి పూడి తిరుపతిరావు కోరారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎంతో గుర్తింపు పొందారని, ఇక్కడి ప్రజలు ఆయన పాలనపట్ల ఎంతో సంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీలోని అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే మాధవ్ తప్పక విజయం సాధిస్తారన్నారు. నాయకులు వాసుపల్లి శ్రీహరి, ఉప్పాడ అప్పారావు, బత్తిన వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు అలంకవారి వీధిలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైనేజీకి శుక్రవారం పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కన్వీనర్ అంజూరి వెంకటలక్ష్మి, అంజూరి రాంబాబు, ఆర్పీ కాత్యాయిని, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, రాజు, సచివాలయ అధికారులు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు జెడ్సీ ప్రత్యేక పూజలు


దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి

మధురవాడ: మాఘమాసం రెండో శుక్రవారం చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారికి జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆమెకు కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. వేదమంత్రాలతో అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, కేశకుర్తి అప్పారావు, ఆర్ఎస్ బాబు, దుర్గాశి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాదచారులకు ఆటంకాలు కలిగించొద్దు


మధురవాడ వుడా కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న సీసీపీ సురేష్ కుమార్ తదితరులు

మధురవాడ: పాదచారులు, వాహనదారుల రాకపోకలకు ఆటంకాలు కలిగించొద్దని, పట్టణంలో ఉన్న ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉంచాల్సిందేనని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ అన్నారు. మధురవాడ వుడా కాలనీ, ఇతర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని కోరుతూ అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆయనతోపాటు జెడ్సీ కనక మహాలక్ష్మి పాల్గొని మాట్లాడారు. నిబంధనల ప్రకారం పాదచారులు స్వేచ్ఛగా రాకపోకలు సాగించడానికి మాత్రమే ఫుట్‌పాత్‌లు ఉపయోగించాలన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు ట్రాఫిక్‌కు అడ్డంకులు లేకుండా చేయాలన్నదే తమ ఉద్దేశమని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జోన్ – 2 ఏసీపీ సీహెచ్.రఘునాథరావు, టీపీబీవో హేమంత్‌కుమార్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు శివప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న నాయకులు, అధికారులు

మధురవాడ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ ప్రియదర్శిని కాలనీ, దోబీ కాలనీల్లో సచివాలయ సిబ్బంది స్వచ్ఛ సర్వేక్షణ్, తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాల్సిన ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతా పరిశుభ్రత పాటించి, తడి పొడి చెత్త వేర్వేరుగా శానిటేషన్ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు ప్రకాశ్, వరలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వేగం కంటే ప్రాణం విలువైనది



అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కుమారస్వామి

తగరపువలస: వేగం కంటే ప్రాణం విలువైనదిగా వాహనదారులు గుర్తించాలని మధురవాడ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె.కుమారస్వామి సూచించారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కలిగించారు. రాంగ్ రూట్లో వెళ్లేవారు, ట్రిపుల్ రైడింగ్ చేసేవారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. ట్రాఫిక్ విభాగం ఎన్ని నిబంధనలు పెట్టినా కొందరు రూల్స్ బ్రేక్ చేస్తున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లను వంచడం, నంబరు కనిపించకుండా స్టిక్కర్లు అంటించడం, నంబరు ప్లేట్లకు పసుపు – కుంకుమ అంటిచడం, మాస్కులు అడ్డం పెట్టడం వంటి మార్గాలను ఆచరిస్తున్నారన్నారు. వీటిన్నింటి కంటే ప్రాణం విలువైనదని, వారిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. ముత్తంశెట్టి మహేష్, పీఎం పాలెం సీఐ నల్లి సాయి, భీమిలి ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, పరిపాలనాధికారి సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్స


మాట్లాడుతున్న మురళీకృష్ణ

కొమ్మాది: అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో క్యాన్సర్‌కు భయపడే రోజులు పోయాయని, ముఖ్యంగా నూతన వైద్య విధానంలో 80 శాతం మంది క్యాన్సర్ నుంచి విజయవంతంగా బయటపడుతున్నారని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్‌కు సంబంధించి ప్రతి 6 నెలలకు కొత్త చికిత్స విధానం ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వస్తోందన్నారు. రొమ్ము, ఊపిరితిత్తులు వంటి క్యాన్సర్లకు చికిత్స, రోగ నిర్ధారణ పరీక్షల సమయంలో వెలువడే సమాచారం డేటా అనలటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా విశ్లేషించి సాధారణ ప్రజల్లో క్యాన్సర్ రావడానికి అవకాశాలు ముందే గుర్తించే వీలుకలుగుతుందన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో పింఛను నగదు అందజేస్తున్న రమేష్

మధురవాడ: విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుని వద్దకు వెళ్లి సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శుక్రవారం పింఛన్ అందజేశారు. మధురవాడ ఆర్‌జీకే కాలనీ 77వ సచివాలయానికి చెందిన కొల్లూరి రామకృష్ణ విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో కొద్ది కాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రికి వెళ్లి వెల్ఫేర్ సెక్రటరీ రమేష్, వలంటీర్ పృధ్వీ వృద్ధునికి పింఛను నగదు అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

అనంతుని కల్యాణోత్సవాలపై సమావేశం నేడు

పద్మనాభం: పద్మనాభంలో మార్చి 2 నుంచి జరగనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలపై శనివారం కుంతీ మాధవ స్వామి ఆలయంలో ముందస్తు సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో నానాజీ బాబు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సంసమావేశానికి కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

యోగాచార్య 'రాపర్తి' శత జయంతి నేడు


మాట్లాడుతున్న యోగా గురువు వెంకటరమణ

భీమునిపట్నం: భీమిలిలోని అంతర్జాతీయ యోగా కేంద్రం వద్ద శనివారం, ఆదివారం యోగాచార్య రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఇక్కడి యోగా కేంద్ర గురువు సీహెచ్.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లడుతూ విజినిగిరిలో ఉన్న ప్రధాన యోగా కేంద్రం యోగాచార్య రామారావు ఎనలేని సేవలు అందించారని, వారి శత జయంతి ఉత్సవాలను రెండు రోజులపాటు ఇక్కడి కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పలువురు యోగా గురువులు, యోగా శిక్షకులు, శిష్యులు పాల్గొంటారని తెలిపారు. ఆయనతోపాటు యోగా కేంద్ర కార్యదర్శి గనివాడ అప్పలనాయుడు ఉన్నారు.

దేవస్థానం భూముల రీసర్వేకు వినతి

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో ఉన్న భీమిలి శివకేశవ శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయానికి చెందిన ఆరు ఎకరాల భూమికి రీ సర్వే జరిపించాలని దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం సచివాలయ అధికారులను కోరారు. ఆలయానికి సంబంధించి నగరపాలెంలో టీడీ నంబర్ 40.8, సర్వే నంబర్ 40/14లో 2.22 ఎకరాలు, టీడీ నంబర్ 40.8, సర్వేనంబర్ 51/1లో 1.24 ఎకరాలు ఉన్నాయి. మిగిలిన 2.54 ఎకరాలకు టీడీ నంబరు మాత్రమే ఉండి సర్వే నంబర్ లేకపోవడంతో సర్వేకు ఆటంకంగా ఉంది. సర్వే నంబరు లేని 2.54 ఎకరాలకు సంబంధిత భీమిలి ఈవో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం దేవాదాయ శాఖకు చెందిన ఈ ఆరు ఎకరాలకు 0.44 సెంట్లు పంచాయతీలో రోడ్డు వేసినందున ఇంకా 5.56 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. ఈ భూమికి సర్వే నిమిత్తం సచివాలయ అధికారులను కలిశారు. వీరిలో మండల ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వసంతరావు, అధికారులు పైల శేఖర్‌బాబు, తాటికొండ రాంబాబు ఉన్నారు.

అట్టహాసంగా షోర్ ఫెస్ట్


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొమ్మాది: యువతలోని ప్రతిభ వెతికితీయడానికి, వివిధ ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలను, కళారూపాలను తెలుసుకోవడానికి గీతంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న షోర్ ఫెస్ట్ – 23 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 4 వేల మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కు అభినందన


ఉప సర్పంచ్ శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి మండలం రేఖవానిపాలెం ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పీతల శ్రీనివాసరావును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలోని పంచాయతీల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మెడి శ్రీను, రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, వార్డు సభ్యులు మల్లేటి శ్రీను, పలిపాల కొండమ్మ, మల్లేటి వరలక్ష్మి, ఉత్తాడ సన్యాసమ్మ, అక్కరమాని అప్పలస్వామి పాల్గొన్నారు.

కళాతపస్వి మెచ్చిన కవి 'బులుసు'


ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లుకు వస్త్రాలు బహూకరిస్తున్న విశ్వనాథ్ దంపతులు (ఫైల్)

తగరపువలస: దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు తగరపువలసకు చెందిన ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు అంటే వల్లమాలిన అభిమానం. ఆయన కావ్యపఠనకు ముగ్ధుడైన విశ్వనాథ్ 2010లో అన్నవరంలో శుభప్రదం సినిమా షూటింగ్ జరుగుతున్న సందర్భంలో బులుసును తన వద్దకు పిలిపించుకున్నారు. రెండు రోజుల పాటు షూటింగ్ విరామ సమయంలో విశ్వనాథ సత్యనారాయణ రచన శ్రీమద్రామాయణ కల్పవృక్షంలోని కావ్యాలను చదివి వినిపించుకున్నారు. షూటింగ్ తర్వాత విశ్వనాథ్ దంపతులు తగరపువలసలోని బులుసు ఇంటికి వచ్చి నూతన వస్త్రాలు బహూకరించారు. విశ్వనాథ్ మరణంతో బులుసు వెంకటేశ్వర్లు.. ఆయనతో తనకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంప్రదాయ కళా పునరుజ్జీవానికి సినిమా మాధ్యమం ద్వారా విశ్వనాథ్ ఎంతో సేవ చేశారన్నారు. అభ్యుదయాన్ని కూడా సందేశంగా సప్తపది, సూత్రధారులు, స్వయంకృషి వంటి చిత్రాల్లో చూపించారన్నారు. ఆయన మరణం కళాజగతికి తీరని లోటని భాషా వైభవం అధ్యక్షుడు కూడా అయిన వెంకటేశ్వర్లు అన్నారు.

పీఎంఈజీపీ పథకంతో ఉపాధి కల్పన

• డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి


సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

ఆనందపురం : ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి మెరుగవుతోందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి చెప్పారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాలకు చెందిన 68 మంది లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుద్యోగులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బ్యాంక్‌ల ద్వారా రుణాలతోపాటు ప్రభుత్వం రాయితీలు కూడా అందిస్తుందని చెప్పారు. తాము ఏర్పాటు చేయబోయే పరిశ్రమకు సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ అందించి ప్రాజెక్ట్ ఉత్పత్తులు మార్కెటింగ్ విషయంలో కూడా అధికార యంత్రాంగం సహకరిస్తుందని చెప్పారు. ప్రాజెక్ట్ మూలధనంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, అర్బన్‌లో 25 శాతం, జనరల్ లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, అర్బన్‌లో 15 శాతం చొప్పున రాయితీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. తయారీ రంగానికి అయితే రూ.50 లక్షలు వరకూ, సేవా రంగం ప్రాజెక్టులకు రూ.20 లక్షల వరకూ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరవుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, ఐకేపీ ఏరియా కో – ఆర్డినేటర్ వైదేహి, ఏపీఎం భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బీమా పరిహారం అందజేత


భవిరిశెట్టి గౌరికి రూ.10వేలు అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు


బాధితురాలికి పరిహారం అందజేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని గంభీరం గ్రామానికి చెందిన బొట్టా కనకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నాయకులు ఆ కుటుంబ సభ్యులకు పరిహారం శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష పరిహారం మంజూరైంది. ఈ మేరకు మృతుడు భార్య రాధకు ముందస్తుగా రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా రూ.90 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. వైఎస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, నాయకులు బోయి వెంకటరమణ, వానపల్లి ముత్యాల రావు, శ్రీను, కార్యదర్శి చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద మృతుని భార్యకు...

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన భవిరిశెట్టి గౌరికి శుక్రవారం వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు చేతుల మీదుగా తక్షణసాయం రూ.10వేలు అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గౌరి భర్త రాంబాబు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాద బీమాలో మిగిలిన రూ.4.90 లక్షలు గౌరి ఖాతాలో జమ అవుతుందని రామునాయుడు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ బి.తులసి శ్రీదేవి, వలంటీర్ రొక్కం పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంప సాయిరెడ్డి, జల్లు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో చదివిస్తున్న జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ

పద్మనాభం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్.చంద్రకళ అన్నారు. మండలంలోని రెండు ప్రాథమిక, రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె, జిల్లా శిక్షణ సంస్థ అధ్యాపకుడు గొట్టేటి రవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించారు. తరగతి గదుల్లో వేస్టు మెటీరియల్, పాత వస్తువులు ఉండడాన్ని గమనించి తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అన్ని తరగతుల్లో నోట్సు, వర్కు బుక్సు పూర్తి స్థాయిలో దిద్దలేదని గమనించారు. బైజూస్ ట్యాబుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అప్లోడ్ చేయకపోవడం, సమ్మెటివ్ పరీక్షల ప్రశ్నాపత్రాల మూల్యాంకణం తర్వాత విద్యార్థుల పొరపాట్లను సరి చేయించకపోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పదో తరగతి మధ్యలో బడి మానేసిన విద్యార్థిని ఇంటికి, పని చేసే ప్రాంతానికి వెళ్లి ఆమె తల్లితో మాట్లాడారు. చదువుకోవడానికి ఇబ్బందులు లేకుండా కస్తూర్బాలో సీటు ఇప్పించి చదివిస్తామని అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఒడిశా రాష్ట్ర కార్మికుల వద్దకు వెళ్లి పాఠశాల వయస్సు గల పిల్లలతో మాట్లాడారు. వారంతా చదువుకోవడానికి ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం రేవిడి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు తరగతులకు తగ్గ అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండడంతో హెచ్‌ఎం రామిరెడ్డిని ప్రశంసించారు.

మటన్ దుకాణ యజమాని అదృశ్యం


షేక్ సైదు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీనగర్ కాలనీకి చెందిన మటన్ దుకాణ యజమాని షేక్ సైదు (38) ఈ నెల 2న ఉదయం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించుకొస్తానని వెళ్లిన సైదు తిరిగి రాకపోవడంతో శుక్రవారం అతని భార్య అమీనా భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు దర్యాప్తు చేస్తున్నారు.